ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

యాదాద్రి భువనగిరి

5

శుక్రవారం 18 అక్టోబరు 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 75

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.154	236	266
సూర్యాపేట	రూ.145	220	250
నల్లగొండ	రూ.148	216	244

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.5 । కనిష్ఠం 23.4

కాలుష్యకాసారంగా మారిన జీవ నది మూసీ ప్రక్షాళనకు ఆది నుంచి ఆటంకాలే ఎదురవుతున్నాయి. 2005 నుంచి మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వాలు శ్రీకారం చుట్టినా ఒక్కటీ ముందుకుపడలేదు. ప్రస్తుత ప్రభుత్వం సైతం కార్యాచరణ అమలుకు పూనుకున్న నాటి నుంచి రాజకీయ వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ ప్రభుత్వమైనా ఆటంకాలను అధిగమించి ఇచ్చిన మాట మేరకు మూసీ ప్రక్షాళన చేపట్టాలని ఉమ్మడి జిల్లా మూసీ పరివాహక రైతాంగం కోరుతోంది.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)



ఆంధ్రజ్యోతి మూసీ మురిసేనా 4

మూసీ ప్రక్షాళనకు
అన్నీ ఆటంకాలే!

మూసీ నది ప్రక్షాళనకు 2005లో శ్రీకారం చుట్టారు. మొత్తం 287 కిలోమీటర్ల ప్రవాహం ఉన్న మూసీ నది హైదరాబాద్ మహానగరంలో ప్రవహించే దాదాపు 58కిలోమీటర్ల పరిధిలో 90 శాతం మేర కాలుష్యానికి గురవుతోంది. ఓ వైపు మహానగరం నుంచి వచ్చే మురుగునీరు, మరోవైపు నగరం చుట్టూ విస్తరించిన పారిశ్రామికవాడల్లోని దాదాపు 12వేల పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్య పూరిత వ్యర్థరసాయనాలు కలవకుండా శుద్ధి చేయడం, మరోవైపు నది కుచించుకుపోయేలా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో ఉన్న ఆక్రమణలు తొలగించడం, మహానగర చెత్త, ఇతర వ్యర్థాలు నదిలో కలపకుండా నిరోధించడం వంటి ప్రధాన పనులు చేపట్టాలని నిర్ణయించారు. అందులో భాగంగా తొలుత మురుగునీటి శుద్ధికి ఎస్టీపీలను నిర్మించాలని నిర్ణయించారు. 2005లో కేంద్రం నిధులు రూ.330 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వ నిధులు కూడా కలిపి నాలుగు ఎస్టీపీలను నిర్మించాలని తలపెట్టారు. వీటిపై అప్పటి ప్రభుత్వాలు శ్రద్ధ పెట్టకపోవడం, స్థానికుల నుంచి ఇబ్బందులు, ఉద్యమాలు, తదితర కారణాలతో 2013 వరకు ప్రాజెక్టు ముందుకు సాగలేదు. చివరకు 2013 నాటికి ఈ నాలుగు ఎస్టీపీలు అందుబాటులోకి వచ్చినా ఆశించిన ప్రయోజనం లేకుండా పోయింది. రాష్ట్ర ఏర్పాటు అనంతరం అప్పటి సీఎం కేసీఆర్ నేతృత్వంలో మళ్లీ 2016లో మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు తెరపైకి వచ్చింది. ప్రక్షాళనతో పాటు మూసీ సుందరీకరణ చేపట్టాలనే లక్ష్యంతో రూ.16,653కోట్ల అంచనాలతో మూసీ రివర్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేశారు. అందులో మూసీ నది నీటి ప్రక్షాళన నిమిత్తం 31 ఎస్టీపీలను నిర్మించేందుకు రూ.3,866కోట్లు ప్రతిపాదించారు. పాత ఎస్టీపీలు, వాటిలో నిర్మాణం పూర్తయిన ఎస్టీపీలు కలిపి మొత్తం 25 ప్రస్తుతం పనిచేస్తుండగా, వీటి ద్వారా సుమారు 775ఎంఎల్‌డీ నీరు శుద్ధి అవుతోంది. ఇంకా 1,200ఎంఎల్‌డీ మురుగునీరు, మరో 1,650 ఎంఎల్‌డీ పారిశ్రామిక వ్యర్థాలు ఇంకా మూసీలో కలుస్తూనే ఉన్నాయి.

> "2005 నుంచి మొదలైన కార్యాచరణ
> ప్రభుత్వాలు మారినా ముందుకు సాగని పనులు
> కేంద్రం మద్దతు అంతంతే
> తాజాగా చేపట్టిన మూసీ ప్రాజెక్టు చుట్టూ రాజకీయం"

ప్రక్షాళనకు కేంద్రం మద్దతు కరువు

మూసీనది ప్రక్షాళన ప్రాజెక్టు 2005 నుంచి మొదలుకాగా, కేంద్ర ప్రభుత్వ మద్దతు ఆశించినరీతిలో దక్కడం లేదనే విమర్శలు ఉన్నాయి. 2006లో ప్రభుత్వభాగస్వామ్యంతో చేపట్టిన ప్రాజెక్టుకు రూ.330కోట్లు మాత్రమే కేంద్రం మంజూరు చేసింది. ఈ నిధులకు సమానంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు కలిపి అప్పటి ప్రభుత్వం నాలుగు ఎస్టీపీలను నిర్మించింది. ఈ నాలుగు ట్రీట్‌మెంట్ ప్లాంట్లు 2013లో పూర్తయ్యాయి. ఆ తర్వాత కేంద్రం ఎలాంటి నిధులు ఈ ప్రాజెక్టుకు ఇవ్వలేదు. ప్రస్తుత రాష్ట్ర రోడ్లుభవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎంపీగా ఉన్న సమయంలో..

మూసీ ప్రక్షాళన చేయకపోతే పరివాహకమంతా రోగాలమయంగా మారుతుందని, జీవజాతుల ఉనికికి ప్రమాదమని శాస్త్రవేత్తల హెచ్చరికలు, కాగ్ నివేదికలు, సామాజికసంస్థల అధ్యయనాల మేరకు 2005 నుంచి మూసీ ప్రక్షాళన పథకాలకు ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన ప్రతీ సందర్భంలో మూసీ ప్రక్షాళన అంశం తెరపైకి రావడం, నిధులకొరత, మూసీ పరివాహకంలో ఆక్రమణల తొలగింపుపై స్థానికుల అభ్యంతరాలు, రాజకీయ ప్రతిబంధకాలతో ఈ ప్రాజెక్టు ముందుకు సాగకుండా ఆగిపోవడం పరిపాటిగా మారింది. హైదరాబాద్ దిగువన ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లా మూసీ పరివాహక ప్రాంత మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రతిపక్ష నాయకులు, ప్రజాసంఘాల నేతలు, సామాజికవేత్తలు మాత్రం ఎప్పటికప్పుడు మూసీ ప్రక్షాళన చేపట్టాలనే అంశానికి కట్టుబడి ఉన్నా, ఆటంకాలను నిరోధించలేకపోతున్నారు. దీంతో మూసీ ప్రక్షాళన ముందుకు సాగడం లేదు.

- మిగతా 6వ పేజీలో

బకాయిలు విడుదల చేస్తేనే
కళాశాలలు తెరుస్తాం

తేల్చిచెప్పిన ప్రైవేట్ యాజమాన్యాలు



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రైవేట్ కళాశాలల నిర్వాహకులు

భువనగిరి టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పెండింగ్ రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తేనే కళాశాలలు తెరుస్తామని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు స్పష్టం చేశాయి. రీయింబర్స్‌మెంట్ విడుదలలో ప్రభుత్వం చేస్తున్న జాప్యాన్ని నిరసిస్తూ చేపట్టిన కళాశాలల బంద్‌లో భాగంగా నాలుగో రోజు గురువారం జిల్లాలో ప్రైవేట్ కళాశాలల బంద్ కొనసాగింది. ఈ మేరకు జిల్లా కేంద్రం భువనగిరిలో నిరసన ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాజమాన్యాల అసోసియేషన్ ప్రతినిధులు దరిపల్లి ప్రవీణ్‌కుమార్, చిక్క ప్రభాకర్‌గౌడ్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సింగనబోయిన మల్లేశం, ఉమ్మడి జిల్లా కార్యదర్శి మధిర మల్లేశం మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం వెంటనే పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. నల్లగొండ జిల్లా హాలియాలో నిరసన తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఎన్టీఆర్ పార్కు నుంచి కలెక్టరేట్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు.

గీతకార్మికులకు అండగా
కాంగ్రెస్ ప్రభుత్వం

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



ఆలేరులో కల్లు తాగుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ఆలేరు రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గీతకార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. గురువారం నియోజకవర్గంలోని 200 మంది గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం మోకులను స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గీత వృత్తికి ప్రభుత్వం అన్ని విధాలా చేయూతనిస్తోందన్నారు.కల్లును శీతల పానీయంగా ప్రభుత్వం గుర్తించనుందని,కార్మికులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు వారి భద్రతకోసం ప్రత్యేకంగా కిట్లను అందిస్తోందన్నారు. ఈ కిట్ల పంపిణీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ భూముల్లో ఈత, తాటి చెట్లను పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందని, 50 ఏళ్లు దాటిన గీత కార్మికులందరికీ ప్రభుత్వం పెన్షన్లు ఇస్తోందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్యరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, టీపీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ దీప్తి, నిరోశ, రమేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. జిల్లాలో 370 ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేయగా, అందులో సన్న ధాన్యాల కోసం 48 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మద్దతు ధరకు బోనస్‌తో కలిపి క్వింటా రూ.2,720 చెల్లిస్తోందన్నారు. రైతులు ధాన్యాన్ని విక్రయించిన మూడు రోజుల్లోనే వారి ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నామన్నారు. గత ఏడాది 53,343 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే, ఈ ఏడాది 86,110 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. అందుకు 30లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు దళారులకు విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్దే విక్రయించాలన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మదార్‌గౌడ్, కౌన్సిలర్లు గుత్త శమంతారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్, చిలుకు కిష్టయ్య, మాజీ ఎంపీపీ గంధమల్ల అశోక్, సురేష్ గౌడ్, ఎజాస్, వెంకటేశ్వర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో...
రైతుల్లో గుబులు

ఓ వైపు వరికోతలు, మరోవైపు వర్షాలు

భారీ వర్షాలు కురిస్తే చేతికొచ్చిన పంట నేలపాలు

ఆందోళనలో రైతులు



ఓ వైపు మబ్బులు కమ్ముకొస్తుండగా వలిగొండ మండలం పొద్దుటూరులోని కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం

యాదాద్రి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆకాల వర్షాలతో రైతులు గుండెల్లో దడ మొదలైంది. జిల్లా వ్యాప్తంగా నాలుగైదు రోజులుగా ఓ మోస్తరుతోపాటు చిరుజల్లులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. అయితే వరి పంట చేతికొచ్చింది. పలు ప్రాంతాల్లో కోతల దశలో ఉండగా, మరికొన్ని చోట్ల వరికోతలు ప్రారంభమయ్యాయి. మూసీ పరివాహక ప్రాంతంలో కోతలు పూర్తయి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. అయితే ఒక్కసారిగా జిల్లా వ్యాప్తంగా ఆకాల వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. చేతకొచ్చిన ధాన్యం నేలపాలవుతోందని ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో బుధవారం సగటున 14.5మిల్లీమీటర్ల వర్షపాతం, గురువారం సగటున 3.5మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తుర్కపల్లి మండలంలో 14మి.మీ, ఆలేరులో 5మి.మీ, మోటకొండూరులో 1.1మి.మీ, యాదగిరిగుట్టలో 1.6మి.మీ, భువనగిరిలో 6.7మి.మీ, బొమ్మలరామారంలో 6.1మి.మీ, చౌటుప్పల్‌లో 1.3మి.మీ, నారాయణపూర్‌లో 9.2మి.మీ, వలిగొండలో 1.2మి.మీ, ఆత్మకూరులో 1.3మి.మీ, మోత్కూరులో 2.5మి.మీ, అడ్డగూడూరులో 6.7మి.మీ, గుండాలలో 1.8మి.మీ వర్షపాతం నమోదైంది. నిత్యం వర్షాలు కురుస్తుండటంతో వరికోతలు ముందుకు సాగడంలేదు. కోత దశలో ఉన్న వరిని సైతం యంత్రాలు కోయలేకపోతున్నాయి. భారీ వర్షాలు కురిసిన పక్షంలో పంటను కోసేందుకు కనీసం వారం రోజులు పడుతుంది. తడిచిన పంట ఆరడంతో పాటు పొలంలో నీరు కూడా ఇంకిపోవాలి. దీంతో చేతికొచ్చిన ధాన్యం నేలపాలవుతుందనే ఆందోళనలో రైతులు ఉన్నాయి. జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 2.80లక్షల...

- మిగతా 8వ పేజీలో

క్రీడలపై యువత ఆసక్తి చూపాలి

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



క్రీడా జ్యోతి ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి కలెక్టరేట్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): యువత వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడలపై ఆసక్తి చూపాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. గురువారం కలెక్టరేట్‌కు చేరుకున్న సీఎం కప్ టార్చ్ ర్యాలీని కలెక్టర్ హనుమంతు కే.జెండగేతో కలిసి కాగడా వెలిగించి ప్రారంభించారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ నుంచి భువనగిరి కోటా వరకు సాగింది. ఈ సందర్భంగా అయిలయ్య మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ, నైపుణ్యం ఉన్న క్రీడాకారులను వెలికితీయడం సీఎం కప్ ఉద్దేశమన్నారు. గ్రామీణస్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు క్రీడాపోటీలు నిర్వహిస్తామన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు క్రీడారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేసిందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎం కప్‌పై విస్తృతంగా చైతన్యం కల్పించి పట్టణ, గ్రామీణ ప్రాంత క్రీడాకారులు పాల్గొనేలా చూడాలన్నారు. ఇదిలా ఉండగా, సీఎం కప్ ర్యాలీ క్రీడాకారులను నిరుత్సాహపరిచింది.ర్యాలీ ప్రారంభం, ముగింపును యంత్రాంగం మమ అనిపించింది. మొత్తం 4కిలోమీటర్ల మేర కొనసాగిన ర్యాలీలో పెద్ద సంఖ్యలో ఎవ్వరూ పాల్గొనలేదు.

క్రీడా మైదానానికి మరమ్మతులుచేయాలి

గుండాల: పాఠశాలలోని క్రీడా మైదానానికి మరమ్మతు చేయాలని మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ, పాఠశాల క్రీడా మైదానం చిన్న పాటి వర్షానికే బురదమయం అవుతోందని, పాఠశాలలో తాగునీరు కూడా సరిగాలేదని, ఈ విషయమై అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని వారు ప్రభుత్వ విప్‌ను కోరారు.

వాల్మీకి చరిత్ర
నేటి తరానికి స్ఫూర్తి

కలెక్టర్ హనుమంతు కే.జెండగే



వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి మాట్లాడుతున్న కలెక్టర్

భువనగిరి కలెక్టరేట్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆదికవి మహర్షి వాల్మీకి జీవిత చరిత్ర నేటితరానికి స్ఫూర్తిగా నిలుస్తోందని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, రామాయణం చదివినప్పుడల్లా అందరికి ఆదికవి వాల్మీకి గుర్తుకు వస్తారన్నారు. ఆయన జీవితచరిత్ర ద్వారా స్ఫూర్తి పొందాలన్నారు. ప్రతీ రోజు మనం చేసే పనిలో మంచి చెడులు గ్రహించి మానవత దృక్పథంతో మెలగాలని, ప్రతీ పనిని అంకితభావంతో చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గంగాధర్, బెన్‌షాలోమ్, డీఆర్డీవో టి.నాగిరెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల శాఖాధికారి యాదయ్య, కలెక్టరేట్ ఏవో జగన్‌మోహన్ ప్రసాద్, వాల్మీకి బోయ కమ్యూనిటీ జిల్లా ప్రెసిడెంట్ రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయాలి

భూదాన్‌పోచంపల్లి: సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. గురువారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, మందుల నిల్వలను పరిశీలించారు. ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించాలని, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు కచ్చితంగా అమలు చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. గ్రామీణ రోగులకు ఆయుష్ కేంద్రాల ద్వారా సరైన వైద్య సహాయం అందించాలన్నారు. ఆయనవెంట మండల వైద్యాధికారిడాక్టర్ శ్రీవాణి, తదితరులు ఉన్నారు.

19 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ఆలేరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బీర్ల ఫౌండేషన్ సౌజన్యంతో ఈ నెల 19న ఆలేరులో జిల్లా స్థాయి అండర్-17 బాల బాలికల (ఎస్‌జీఎఫ్) కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్టు భువనగిరి జిల్లా పాఠశాలల క్రీడల సమాఖ్య కార్యదర్శి బెజ్జం బాలకిషన్, వ్యాయామ ఉపాధ్యాయుడు పూల నాగయ్య తెలిపారు. గురువారం స్థానికంగా మాట్లాడుతూ, పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ పోటీలు ప్రారంభమవుతాయని, క్రీడాకారులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పిస్తామన్నారు. వివరాలకు సెల్ నెంబర్ 9848387964లో సంప్రదించాలని కోరారు.

మత్స్యకారులకు ప్రభుత్వం అండ

ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



వలిగొండ పెద్దచెరువులో చేపలను వదులుతున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

వలిగొండ, బీబీనగర్ అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మత్స్యకార్మికుల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం వలిగొండ మండల కేంద్రంలోని పెద్దచెరువు, బీబీనగర్ మండల కేంద్రంలోని పెద్ద చెరువులో చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూరు శాతం సబ్సిడీపై నాణ్యమైన చేపపిల్లలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాసిరకం చేపపిల్లలను ఇవ్వడంతో మత్స్యకారులు నష్టపోయారన్నారు. చేపపిల్లల పెంపకంపై మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యాలు సరికావన్నారు. చెరువులో నీరుంటేనే చేపల పెంపకం సాధ్యమని ఆయనకు తెలియకపోవడం హాస్యాస్పదమన్నారు. మూసీ ప్రక్షాళనకు ప్రజల మద్దతుతో పాటు పార్టీలకు అతీతంగా నాయకులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ప్రక్షాళనతో స్వచ్ఛమైన నీరు అందుతుందని దీనిపై ఆధారపడ్డ వ్యవసాయం, మత్స్య సంపద, చేనేత పరిశ్రమ అభివృద్ధి చెందుతాయన్నారు. మూసీ పరివాహకంలో నివాసం ఏర్పాటుచేసుకున్న వారికి కొంత ఇబ్బంది కలిగినా, వారికి పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం తగిన ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. ప్రభుత్వం మత్స్యకార్మికులకు రూ.5లక్షల ఉచిత బీమా అందజేస్తోందన్నారు. కార్యక్రమాల్లో ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, మత్స్యకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పాశం సంజయ్‌బాబు, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, ఏడీ రాజారామ్, మాజీ ఎంపీపీ నూతి రమేష్‌రాజు, నాయకులు కుంభం విద్యాసాగర్‌రెడ్డి, సోమనబోయిన సతీష్, పాశం సత్తిరెడ్డి, కంకల కిష్టయ్య, వాకిటి అనంతరెడ్డి, బాల్‌నర్సింహ, బోళ్ల శ్రీను, సహదేవ్, లింగయ్య, బీబీనగర్ పీఏసీఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పంజాల రామాంజనేయులుగౌడ్, గోళి పింగల్ రెడ్డి, పొట్టోళ్ల శ్యాంగౌడ్, గోళి నరేందర్‌రెడ్డి, నికిల్‌రెడ్డి, జెండ ప్రవీణ్, పాల్గొన్నారు.

హాస్టళ్లు తెరిచి మూడు రోజులైనా
వార్డెన్లు లేరు

•6లో..



మోత్కూరు బీసీ హాస్టల్‌లో మెనూను పరిశీలిస్తున్న అధికారులు



పూజల్లో పాల్గొన్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం

ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి
- నేత్రపర్వంగా శ్రీవేణుగోపాలస్వామి కల్యాణోత్సవం

చిట్యాలరూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తిలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో గురువారం స్వామివారి కల్యాణోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, పూలమాలతో అలంకరించి కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు వడిబియ్యం సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. స్వామివారిని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దర్శించుకుని కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దైనందిన జీవితంలో ఉరుకులు పరుగులతో కూడిన జీవనాన్ని గడుపుతున్నారని, కుటుంబ సభ్యులతో దేవాలయాన్ని సందర్శించి భగవంతుడిని దర్శించుకుంటే మానసిక ప్రశాంతతతో పాటుగా భక్తిభావం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయం చైర్మన్ నర్రా మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లు తెరిచి మూడు రోజులైనా

వార్డెన్లు లేరు



మోత్కూరు ఎస్సీ బాలికల హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

మోత్కూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల వసతి గృహాలు తెరిచి మూడు రోజులైనా వార్డెన్లు, వర్కర్లు సక్రమంగా విధులకు హాజరు కావడం లేదు. బీసీ బాలికల హాస్టల్లో వార్డెన్ లేరు, విద్యార్థినులూ లేరు. కొన్నింటిలో విద్యార్థులు వచ్చిందీ 10మంది లోపే. ఆ వచ్చిన వారికీ వర్కర్లు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదు. మోత్కూరు మండల కేంద్రంలోని హాస్టళ్లను తహసీల్దార్ డి.రాంప్రసాద్, ఎంఈవో టి.గోపాల్‌రెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి, కమిషనర్ సి.శ్రీకాంత్ గురువారం ఉదయం తనిఖీ చేయగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. బీసీ బాలుర హాస్టల్‌లో 65 మంది విద్యార్థులకు 10మంది పాఠశాల విద్యార్థులు, 10మంది కళాశాల విద్యార్థులకు ఇద్దరు వచ్చారు. హాస్టల్‌లో వార్డెన్ జ్యోతి అందుబాటులో లేరు. ఉన్న 10మంది విద్యార్థులకు ఉదయం 6గంటలకు ఇవ్వాల్సి రాగిజావ ఇవ్వలేదు. పాఠశాలకు వెళ్లే ముందు జీరారైస్ లేదా టమాట రైస్ ఇవ్వాల్సి ఉండగా, అన్నం వండి, చారు చేశారు. కొద్దిగా పప్పుకూర వండామని చెబుతున్నా, 10మంది విద్యార్థుల్లో చివరి వారికి దొరకనే లేదు. ఇదేంటని అధికారులు అడిగితే పప్పు అయిపోయిందని వర్కర్లు తెలిపారు. కళాశాల విద్యార్థులను ఉదయం తిని వెళ్లాక మళ్లీ రావొద్దని అంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎస్సీ బాలికల హాస్టల్‌లో సుమారు 100మంది విద్యార్థినులకు ఏడుగురు మాత్రమే వచ్చారు. అధికారులు వెళ్లే సరికి ముగ్గురు అమ్మాయిలు మాత్రమే ఉన్నారు. ఉదయం 6గంటలకు పాలతో రాగి మాల్ట్ ఇవ్వలేదన్నారు. పాఠశాలకు వెళ్లేప్పుడు టమాట రైస్ ఇచ్చారని విద్యార్థినులు తెలిపారు. వార్డెన్ లేరు. తహసీల్దార్ ఫోన్ చేసి అడగ్గా తనకు రామన్నపేట హాస్టల్ ఇన్‌చార్జి ఉందని, అక్కడకు వెళ్లానన్నారు. హాస్టల్‌లో ఐదుగురు వర్కర్లకు ఒక్కరే, అదీ ఒకరి బదులు మరొకరు ఉన్నారు. ట్యాంకు నిండి నీళ్లు వృథాగా పోతున్నా మోటారు ఆఫ్ చేసే నాథుడే లేడు. బాత్‌రూంల డోర్ రేకులు పగిలి అస్తవ్యస్తంగా ఉన్నాయి. దీంట్లో అమ్మాయిలు స్నానాలు ఎలా చేస్తారని మునిసిపల్ చైర్‌పర్సన్ కవిత ప్రశ్నించారు. బీసీ బాలికల హాస్టల్‌కు వెళ్లగా అక్కడ వార్డెన్, విద్యార్థినులు లేరు. హాస్టల్ తెరిచి మూడు రోజులైనా విద్యార్థినులు రాలేదని వర్కర్ అరుణ తెలిపారు. వార్డెన్ రాలేదా అని ఎంఈవో అడగ్గా నిన్న వచ్చారని, ఈ రోజు రాలేదని తెలిపారు. నిన్న కూడా రాలేదని ఎంఈవో అనగా, వచ్చారని, తనకు డబ్బు కూడా ఇచ్చిరని సమాధానం చెప్పారు. అయితే తనకు హైదరాబాద్‌లో కలిశారని, ఇక్కడికి ఎప్పుడు వచ్చారని, డబ్బు ఎలా ఇచ్చారని అడగ్గా ఫోన్‌పే చేసినట్టు తెలిపారు. వార్డెన్ జ్యోతి హాస్టల్‌కు రాకుండా వర్కర్‌తో అబద్ధం చెప్పిస్తునారని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టళ్లలో గమనించిన విషయాలన్నింటినీ జిల్లా అధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ రాంప్రసాద్, ఎంఈవో గోపాల్‌రెడ్డి తెలిపారు. మునిసిపల్ వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య వారి వెంట ఉన్నారు.

అన్నీ ఆటంకాలే

(మొదటి పేజీ తరువాయి)

మూసీ ప్రక్షాళన ప్రాజెక్టును కేంద్రం చేపట్టాలని డిమాండ్ చేస్తూ అప్పటి కేంద్ర జలవనరులశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు వినతిపత్రం అందజేశారు. నమామి గంగ తరహాలో మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు రూపొందించాలని, అందుకు కేంద్రం నిధులివ్వాలని ఆయన కోరారు. మూసీ ప్రక్షాళనను గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ప్రతిపాదించినా కేంద్రం కొర్రీలు వేసిందే తప్ప నిధులివ్వలేదని మాజీ ప్రజాప్రతినిధులు విమర్శిస్తున్నారు. తాజాగా, సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మూసీ ప్రక్షాళనకు కేంద్రమంత్రికి విన్నవించారు. కేంద్రం నిధుల విషయంలో ఏం హామీ ఇస్తుందో ఇంకా స్పష్టత రాలేదు. అయితే ఈ ప్రాజెక్టుకు కేంద్రం మద్దతు ఇస్తేనే ఆశించిన రీతిలో మూసీ ప్రక్షాళన ముందుకు సాగుతుందని, రైతుల విస్తృతస్థాయి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్టుకు కేంద్రం కూడా నిధులిచ్చేందుకు బీజేపీ నేతలు కృషి చేయాలనే సూచనలు వస్తున్నాయి.

రాజకీయ వివాదంలో తాజా ప్రాజెక్టు

అనివార్యంగా చేపట్టాల్సిన మూసీ ప్రక్షాళన కార్యక్రమం తరచూ రాజకీయ వివాదాల్లో చిక్కుకుంటోంది. ప్రస్తుతం మూసీ ప్రక్షాళనను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టగా, దాన్ని కొన సాగిస్తే రానున్న రెండు, మూడేళ్లలోనైనా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పరివాహక ప్రాంతానికి పట్టిన కాలుష్యపీడ విరగడవుతుందని రైతులు భావిస్తున్నారు. అయితే తాజా, ప్రాజెక్టులో మొదటి దశలో హైదరాబాద్ పరిధిలో మూసీ నదిలో బఫర్‌జోన్‌లో, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఆక్రమణలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టగా అది రాజకీయ వివాదంగా పరిణమించింది. ఆక్రమణల తొలగింపుతో పాటు, మూసీ నీటి ప్రక్షాళన కోసం ప్రభుత్వం మరో 39 ఎస్టీపీలను నిర్మించాలని తలపెట్టింది. అందుకోసం రూ.3,849కోట్ల నిధులు కేటాయించింది. అయితే తాజా, రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ ప్రాజెక్టు ఏమేరకు ముందుకు సాగుతుందనే సందిగ్ధం ఉమ్మడి జిల్లా వాసుల్లో నెలకొంది. ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు ఈసారి ఆటంకాలను పరిష్కరిస్తూ మూసీ ప్రక్షాళన చేపట్టాల్సిందేనని ఉమ్మడి జిల్లా మూసీ పరివాహక రైతాంగం కోరుతోంది.

కోటేశ్వర్ ముందు...

ఓడిపోతున్న వైకల్యం

- పోలియోబారిన పడ్డా తగ్గని ఆసక్తి
- వీల్‌చైర్ బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, క్రికెట్‌లో సత్తా
- పారాఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యం

క్రీడలంటే కోటేశ్వర్‌కు ఆసక్తి. స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడేవాడు. ఇందులో వింతేముంది అనుకుంటున్నారా?. పోలియోతో ఓ కాలు పూర్తిగా సహకరించకపోయినా మరో కాలి బలంతో ఆడేవాడు. స్నేహితుల ప్రోత్సాహంతో బై రన్నర్‌ను పెట్టుకుని బ్యాటింగ్ మాత్రమే చేసేవాడు. క్రీడలపై ఆసక్తిని చూసిన ఓ కోచ్ పలు క్రీడల్లో కోటేశ్వర్‌ను ప్రోత్సహించడంతో అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నాడు. వీల్‌చైర్ క్రికెట్‌తో పాటు హ్యాండ్‌బాల్, బాస్కెట్ బాల్ విభాగాల్లో ప్రతిభ కనబరుస్తున్నాడు. 2020లో పారాఒలింపిక్స్ క్వాలిఫయర్ రౌండ్ వరకు వెళ్లాడు.

(ఆంధ్రజ్యోతి- చందంపేట)

నల్లగొండ జిల్లా చందంపేట మండలం గన్నేర్లపల్లి పరిధి ధర్మ తండాకు చెందిన తావూర్యనాయక్, భారతీ దంపతుల కుమార్తె ఇద్దరు కుమారుల్లో పెద్దవాడు కోటేశ్వర్. ఐదేళ్ల వయసులోనే పోలియో బారినపడి కుడికాలు బలం కోల్పోయింది. ప్రాథమిక విద్యతో పాటు ఇంటర్ వరకు దేవరకొండలో చదివాడు. క్రీడలంటే కోటేశ్వర్‌కు చాలాఆసక్తి. గమనించిన స్నేహితులు ఓదార్పు కోసం అతడికి బ్యాటింగ్ ఇచ్చేవారు. ఒంటికాలిపై నిలబడి బ్యాటింగ్‌లో ప్రతిభ కనబరిచేవాడు. ఈ క్రమంలో స్నేహితులు క్రికెట్ ఆడే ప్రతీ సందర్భంలోనూ అతడికి అవకాశం కల్పిస్తుండేవారు.

మలుపు తిప్పిన డిగ్రీ

కోటేశ్వర్ డిగ్రీ చేయడం కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. ఉస్మానియాలో పీజీ చేస్తున్న సమయంలోనే వీల్‌చైర్ క్రీడల్లో కోటేశ్వర్ ప్రతిభను కోచ్ సోహెల్‌ఖాన్ గమనించాడు. అతడికి బాసెట్‌బాల్, హ్యాండ్‌బాల్ పోటీల్లో శిక్షణ ఇచ్చాడు. క్రికెట్‌లోనూ కోటేశ్వర్ శిక్షణ పొందాడు. దీంతో రాష్ట్ర, జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు కోటేశ్వర్‌కు అవకాశం దక్కింది.

రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ..

రాష్ట్ర, జాతీయ స్థాయిలో 2018 నుంచి కోటేశ్వర్ వీల్‌చైర్ బాస్కెట్ బాల్, క్రికెట్‌లో రాణిస్తున్నారు. వివిధ టోర్నీల్లో జట్టు విజయానికి తోడ్పాడు. ప్రస్తుతం రాష్ట్రం తరుపున వీల్‌చైర్ క్రికెట్, బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా టీంకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇటీవల చెన్నైలో జరిగిన సౌత్‌జోన్ వీల్‌చైర్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో తన కెప్టెన్సీ సారథ్యంలోనే జట్టు సిల్వర్ మెడల్ సాధించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బెస్ట్ పారా స్పోర్ట్స్ పర్సన్ అవార్డును మంత్రి సీతక్క నుంచి కోటేశ్వర్ అందుకున్నారు. అతడి పట్టుదల ముందు కాలి వైకల్యం ఓడిపోతోంది. పట్టుదల, ఆత్మస్థైర్యంతో ఎన్నో విజయాలు సొంతం చేసుకుంటున్న కోటేశ్వర్ పారా అథ్లెట్స్‌లో స్ఫూర్తిని నింపుతున్నారు.



చెన్నైలో వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ టీంతో కోటేశ్వర్(రౌండప్‌లో)

- 2018, 2019లలో బాస్కెట్‌బాల్ జాతీయస్థాయి జట్టులో సభ్యుడు.
- 2020 పారాఒలింపిక్స్‌లో క్వాలిఫయింగ్ పోటీల్లో పాల్గొన్నప్పటికీ అవకాశం దక్కలేదు.
- 2022లో పోర్చుగల్‌లో జరిగిన వరల్డ్ సిక్స్ ఏ సైడ్ వీల్‌చైర్ హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ సాధించిన జట్టులో సభ్యుడు.
- 2022లో ఈజిప్టులో జరిగిన ఫోర్ ఏ సైడ్ విభాగంలో వరల్డ్ ఛాంపియన్ హ్యాండ్‌బాల్ టీంలో సభ్యుడు.
- 2022 సౌత్ జోన్‌స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో సిల్వర్‌మెడల్ సాధించిన జట్టులో సభ్యుడు.
- 2022లో జరిగిన ఇంటర్నేషనల్ బాస్కెట్‌బాల్ సిల్వర్ మెడల్ సాధించిన జట్టులో సభ్యుడు.
- 2023లో టీ-20 క్రికెట్ మనాస్ ఇండో, బంగ్లా ఫ్రెండిషిప్ కప్‌లో ఇండియా తరపున ఆడాడు.
- ఈ ఏడాది నేపాల్ రాజధాని ఖాట్మండులో జరిగిన వీల్‌చైర్ క్రికెట్ పోటీల్లోనూ పాల్గొన్నాడు.



పారాఒలింపిక్స్ పతకమే లక్ష్యం



పారాఒలింపిక్స్‌లో దేశం తరుపున ఆడాలన్నదే నా లక్ష్యం. నాకు ప్రోత్సాహం అందించేందుకు అడ్వాన్స్ టెక్నాలజీ కలిగిన ఒక వీల్‌చైర్ అవసరం. దాతలు కాని, ప్రభుత్వం కానీ అందజేస్తే మరింత ప్రోత్సాహంతో ఆడతా. దేశానికి పారాఒలింపిక్స్‌లో పతాకం తేవాలన్నది నా ఆకాంక్ష. అందుకు సహకరించాలి.

\- కోటేశ్వర్, పారా అథ్లెట్

అందుకే అలాచేశా..

- రెవెన్యూ, మున్సిపల్ స్థలాల రిజిస్ట్రేషన్లపై పోలీసుల విచారణ
- ముగిసిన తహసీల్దార్ జయశ్రీ పోలీస్ కస్టడి
- సబ్‌జైలుకు తరలించిన పోలీసులు
- హైకోర్టులో బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేసిన తహసీల్దార్

హుజూర్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ మండలంలో ప్రభుత్వ భూముల పట్టాల మార్పిడి ఘటనల్లో అరెస్టయిన తహసీల్దార్ వజ్రాల జయశ్రీ, ధరణి ఆపరేటర్ జగదీష్ పోలీస్ కస్టడీ గురువారంతో ముగిసింది. అయితే గత ప్రభుత్వంలోని కొందరు ప్రభుత్వ పెద్దల ఒత్తిడితోనే ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్ చేసినట్టు పోలీసుల విచారణలో తహసీల్దార్ వివరించినట్టు సమాచారం.

హుజూర్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో సీఐ చరమందరాజు, ఇతర ఉన్నతాధికారులు వారిని విచారించారు. ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం వరకు సుమారు 4.30గంటల పాటు తహసీల్దార్‌ను పోలీసులు విచారించారు. గరిడేపల్లి, నేరేడుచర్ల మండలాల్లో సుమారు ఆరేళ్లపాటు తహసీల్దార్‌గా పనిచేసిన జయశ్రీ హయాంలో జరిగిన భూముల రిజిస్ట్రేషన్ల విషయాన్ని పోలీసులు ప్రత్యేకంగా విచారించినట్టు సమాచారం. రైతుబంధు డబ్బు ఎలా ఖర్చు చేశారని పోలీసులు ప్రశ్నించినట్టు సమాచారం. కాగా, తహసీల్దార్ భర్త ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా, ఆయనతో పాటు ఆమె కుటుంబ సభ్యులు, బంధువులకు సంబంధించి కూడా పోలీసులు విచారించినట్లు తెలిసింది. కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలకు సంబంధించి ఆరా తీసినట్లు సమాచారం. కాగా కొన్ని ప్రశ్నలకు ఎలాంటి సమాధానాలు చెప్పకపోవడంతో వాటికి సంబంధించిన ఆధారాలను చూపి పోలీసులు విచారణ చేసినట్లు తెలిసింది. మూడురోజుల విచారణలో గత ప్రభుత్వంలోని ప్రముఖుల ఒత్తిడి మేరకు కొన్ని రిజిస్ట్రేషన్లు చేసినట్టు తహసీల్దార్ వెల్లడించినట్లు సమాచారం.

హుజూర్‌నగర్ మునిసిపాలిటీలో లేఅవుట్ స్థలాలు, రెవెన్యూ స్థలాల రిజిస్ట్రేషన్ల ఘటనలపైనా పోలీసులు విచారణ చేసినట్టు తెలిసింది. పట్టణంలోని మునిసిపల్ పరిధిలో సుమారు 60వేల గజాల లేఅవుట్ స్థలాలు ఉన్నాయి. మూడేళ్లలో అప్పటి ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా వీటిని రిజిస్ట్రేషన్ చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. రూ.100కోట్లకు పైగా విలువచేసే ప్రభుత్వ భూములతో పాటుగా ప్రైవేట్ వ్యక్తుల పేర్లతో ఉన్న ప్లాట్లను కూడా కుంటల్లో రిజిస్ట్రేషన్లు చేసినట్టు విమర్శలు ఉన్నాయి. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొంతమంది వ్యక్తులు, వివిధ పదవుల్లో ఉన్న నాయకుల పేరున మునిసిపల్, రెవెన్యూ స్థలాలను తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. సాయిబాబా థియేటర్ రోడ్డు, రామస్వామి గట్టుకు వెళ్లే దారిలో కొన్ని లేఅవుట్ స్థలాలు, లక్కవరం రోడ్డు, లింగగిరి రోడ్డు, చింతలబజారు రోడ్డు, శ్రీనగర్‌కాలనీ రోడ్డు, మిర్యాలగూడ రోడ్డు, కోదాడ రోడ్డులోని పరిసర ప్రాంతాల్లో వందల ఎకరాల ప్రభుత్వ భూములు ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తమయ్యాయి. వీటితో పాటు చెరువు శిఖం భూములు సైతం రిజిస్ట్రేషన్లు చేశారు. గత ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించిన ముఖ్యనేతలు వీటి వెనుక సూత్రధారులుగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో విచారణ మొత్తం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ భూములపైనే పోలీసులు దృష్టి సారించినట్టు తెలుస్తోంది.

పట్టణంలోని ఫణిగిరి గట్టు వద్ద జర్నలిస్టులకు ఇచ్చిన ఇళ్ల స్థలాలపైనా తహసీల్దార్‌ను విచారించినట్లు తెలిసింది. జర్నలిస్టుతోపాటు అసలు పత్రికల్లో పనిచేయని వారికి, అదేవిధంగా నల్లగొండ, హైదరాబాద్ లాంటి ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులకు పట్టాలు జారీచేసిన అంశంపై విచారణ జరిగినట్లు తెలిసింది. గత ఏడాది ఫణిగిరిగట్టు వద్ద సుమారు 100 మందికి పైగా జర్నలిస్టులకు పట్టాలు జారీచేశారు. వారే కాకుండా రెవెన్యూ కార్యాలయాలలో పనిచేసే వ్యక్తులు, వివిధ హోదాల్లోని వారికి కూడా పట్టాలు మంజూరయ్యాయి. ఓ ప్రజాప్రతినిధికి బంధువు ఇళ్ల పట్టాలు మంజూరు చేయించినట్టు గతంలో ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో పోలీస్ కస్టడీలో ఉన్న తహసీల్దార్‌ను వీటిపై విచారించినట్టు సమాచారం.

మొత్తంగా మూడురోజుల విచారణ అనంతరం గురువారం సాయంత్రం 4.30 గంటలకు కస్టడీ ముగియడంతో తహసీల్దార్‌ను హుజూర్‌నగర్ సబ్‌జైలుకు తరలించారు. ఇద్దరు మహిళా అధికారులు, మరో ఇద్దరు మహిళా పోలీసుల సమక్షంలో విచారణ సాగింది. విచారణ మొత్తం వీడియో తీశారు. తహసీల్దార్ జయశ్రీ ఈ నెల 9న అరెస్ట్ కాగా, కోర్టు 14 రోజులపాటు రిమాండ్ విధించింది. ఈ నెల 10న మొదటిసారి ఆమెను కోర్టు అనుమతితో పోలీసులు కస్టడీలోకి తీసుకుని ఒక రోజు విచారించారు. అనంతరం మళ్లీ ఈ నెల 14న కోర్టు అనుమతి తీసుకుని 15, 16, 17 తేదీల్లో మూడురోజుల పాటు పోలీసు కస్టడీలో విచారించారు. మొత్తం నాలుగురోజుల పాటు విచారించిన పోలీసులు తిరిగి 17వ తేదీ సాయంత్రం ఆమెను హుజూర్‌నగర్ సబ్‌జైలుకు తరలించారు. ఇదిలా ఉండగా గురువారం హైకోర్టులో తహసీల్దార్ బెయిల్ పిటిషన్ వేయగా, అది వాయిదా పడినట్టు పోలీసులు తెలిపారు.

నకిలీల మాయాజాలం



మార్కెట్‌లో లభిస్తున్న వాటిలో అసలేదో, నకిలీ ఏదో తెలుసుకోలేని పరిస్థితి దాపురించింది. దేశాని కి వెన్నముకగా ఉన్న వ్యవసాయ రంగం నేడు నకిలీల ముప్పును ఎదుర్కొంటోంది. పంటల సాగులో ప్రధాన భూమిక పోషించే రసాయన మందులపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో మార్కెట్లో నకిలీ మందులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ఈ డుబ్లికేట్ దందా చేస్తున్న వ్యాపారులు లాభాలు గడిస్తుంటే, పంట సాగులో నిరంతరం శ్రమిస్తున్న రైతులు ఆర్థికంగా ఆర్థికంగా చితికిపోతున్నారు.

\- ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ(వ్యవసాయం)

- పుట్టగొడుగుల్లా మార్కెట్లోకి
- బయోలతో పంటలకు ముప్పు
- ఏటా రూ.కోట్లలో దందా
- నష్టపోతున్న అన్నదాతలు

పట్టించుకోని ప్రభుత్వాలు

మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఖరీదైన మందు ల పేరుతో నకిలీ మందులు రాజ్యమేలుతున్నా యి. లీటర్ రెండు వేల నుంచి ఆపై ధరలు ఉన్న రసాయన మందుల కంపెనీ లేబుళ్లు, డబ్బాలతో సహా నకిలీలను తయారు చేస్తున్నారు. అసలు, నకిలీలను గుర్తించే బార్‌కోడ్‌లను కూడా గుర్తించలేనంతగా మార్చి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. దీంతో సాధారణ రైతులు వీటిని గుర్తించే అవకా శం లేదు. రెండు రోజుల కిందట నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో ఓ పెస్టిసైడ్ దుకాణంలో ప్రముఖ కంపెనీల పేరుతో ఉన్న నకిలీ దోమ మందులను ఓ రైతు కొనుగోలు చేశాడు. ఆ మందుపై అనుమానంతో కంపెనీ ప్రతినిధుల ను సంప్రదించాడు. వారు అవి నకిలీవని తేల్చి అధికారులకు ఫిర్యాదు చేశారు.

తక్కువ ధరకు విక్రయిస్తూ

ప్రధాన కంపెనీ మందు ధర రూ.5 వేలు ఉండగా నకిలీ మందులు రూ.4 వేలకు విక్రయిస్తున్నారు. తక్కువ ధర వస్తుందనే ఆలోచనతో రైతులు కొనుగోలు చేస్తున్నారు. ప్రధాన కంపెనీల మందులు విక్రయిస్తే దుకాణదారులకు మిగులు పాటు నామమాత్రంగా ఉంటుంది. నకిలీలు విక్రయిస్తే 50 శాతం లాభం ఉంటుంది. దీంతో చాలామంది వ్యాపారులు ఏళ్ల తరబడి నకిలీల విక్రయాలకు చేపడుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అతిపెద్ద మార్కెట్ అయిన మిర్యాలగూడ పట్టణంతో పాటు సాగర్ నియోజకవర్గం, హుజూర్‌నగర్, కోదాడ ప్రాంతాల్లో వ్యాపారులు నకిలీల మాయాజాలం ప్రదర్శిస్తున్నారు.

సరిహద్దులో ఉండటంతో..

నకిలీ మందులు గుంటూరు కేంద్రంగా తయారు చేస్తున్నట్లుగా రైతులు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని మిర్యాలగూడ, నాగార్జునసాగర్, హుజూర్‌నగర్ నియోజకవర్గాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సరిహద్దుల్లో ఉంటాయి. దీంతో అక్కడి నుంచే అన్నిరకాల నకిలీ మందులు దిగుమతి చేసుకుంటున్నట్లు సమాచారం. ఈ ప్రాంతంలో లక్షలాది ఎకరాలో పంటల సాగు ఉండటం వ్యాపారులకు వరంగా మారింది. ఏళ్ల తరబడి నకిలీల దందా సాగిస్తూ రూ.కోట్లు కొల్లగొడుతు అన్నదాతలను ఆర్థికంగా నష్టపరుస్తున్నారు. అయినప్పటికీ వ్యాపారులను అడ్డుకునే వారే కరవయ్యారు. రైతులు గుర్తించి కంపెనీల ప్రతినిధులకు ఫిర్యాదు చేస్తే తప్ప నకిలీలపై వ్యవసాయాధికారుల పర్యవేక్షణ కరువైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బయో మందులకు అడ్డేలేదు

నకిలీ మందుల తరువాత ప్రధానంగా మార్కెట్‌ను శాసించేది బయో మందులు. వందలాది కంపెనీలు బయో మందులు పేరుతో మాయాజా లం ప్రదర్శిస్తున్నాయి. సాధారణంగా రసాయనా లు లేకుండా కేవలం పర్యావరణానికి ఎటువంటి హాని కలిగించని సహజ సిద్ధమైన వాటి నుంచే(సముద్రపు నాచు తదితరాలు) ఈ బయో మందులు తయారు చేయాలి. కానీ, మార్కెట్లోకి లభించే మందులు మాత్రం పూర్తిగా ప్రమాదకర రసాయనాలు మిళితం చేసినవి వస్తున్నాయి. డబ్బాలపై మాత్రం అందమైన రంగులతో తీర్చిదిద్ది ఉంటాయి. అసలు రసాయనికి కంపెనీల కన్నా ఈ బయో మందులు తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. వాస్తవంగా బయో మందులు తయారు వ్యవహారం చాలా ఖరీదైంది. కానీ చాలా తక్కువ ధరకు ఏవిధంగా విక్రయిస్తున్నారో వ్యాపారులు కూడా చెప్పలేకపోతున్నారు. పెద్ద రసాయనిక కంపెనీల్లో కాలం పూర్తయిన రసాయనాలను వేలం పాట వేస్తుంటారు.. ఈ బయో కంపెనీలు ఆ సరుకును తక్కువకు కొనుగోలు చేసి బయోమందులు తయారు చేస్తుంటారని వ్యవసాయ నిపుణులు చెపుతున్నారు.

ఈ బయో మందులు ప్రతీ పెస్టిసైడ్ దుకాణంలో విరివిరిగా లభిస్తుంటాయి. ఎక్కువ లాభా లు వస్తుండటంతో వీటినే ఎక్కువగా విక్రయిస్తుంటారు. దీంతో పాటు వ్యాపారులకు కంపెనీలు ఆఫర్లు ఇస్తుంటాయి. ఒకటి కొంటే మరొకటి ఉచి తం. ధరలో సగం మిగులు ఉండటంతో పాటు విదేశీ పర్యటనకు తీసుకెళ్తుంటాయి. దీంతో వ్యా పారులు వీటినే ఎక్కువగా విక్రయించేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. మార్కెట్‌లో బయోలకు డిమాండ్ ఉండేలా వ్యాపారులు ప్రచారం కల్పిస్తుండటమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

పంటలకు తీవ్ర నష్టం

నకిలీ, బయో మందుల పిచికారీతో పంటలతో పాటు పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. నకిలీ మందులు పిచికారీ చేయడం వల్ల అవి పనిచేయక పోగా పంటలు దెబ్బ తింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయో మందులు వాడకంతో పంట తాత్కాలికంగా పచ్చగా అందంగా మారుతుంది, కారణం వాటిలో కలిపే నైట్రోబెంజియట్, జిబ్బరిల్లిక్‌యాసిడ్ అని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. అయితే పంటలో కొద్ది రోజులకే రోగనిరోధక శక్తి తగ్గి తెగుళ్ల ప్రభావం అధికమవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దిగుబడులు తగ్గడంతో పాటు గింజ నాణ్యతలోనూ లోపాలు ఉంటాయన్నారు.

పర్యవేక్షణ కరువు

మార్కెట్లో నకిలీ పురుగుమందులు దందా సాగుతున్నా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందని రైతులు మండిపడుతున్నారు. నకిలీలు ఎక్కడైనా పట్టుబడితే తప్ప దుకాణాలపై అధికారుల నిరంతర పర్యవేక్షణ కరువైందంటున్నారు. నకిలీ, బయయోలతో రైతులు దగాపడుతున్నా పట్టించుకోవడం లేదంటున్నారు. ప్రభుత్వం నకిలీలు, బయో మందులపై పూర్తిస్థాయిలో నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


నకిలీ పురుగుమందులు స్వాధీనం

- తనిఖీలో బయటపడ్డ వ్యాపారుల దందా
- వీర్లపాలెంలో ఆగ్రోస్‌రైతుసేవా ఫర్టిలైజర్ దుకాణం సీజ్
- మిర్యాలగూడలో ఇద్దరు డీలర్ల లైసెన్స్ రద్దు
- వాడపల్లి పోలీసులకు వ్యవసాయాధికారుల ఫిర్యాదు

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నకిలీ పురుగుమందులతో రైతులను దగా చేస్తున్న వ్యవహారంపై అధికారులు స్పందించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ డివిజన్ పరిధిలో గుట్టుగా సాగిపోతున్న నకిలీ ఫర్టిలైజర్స్ దందాను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. దీంతో గురువారం జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ మిర్యాలగూడ ఏడీఏ దేవ్‌సింగ్‌తో కలిసి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మిర్యాలగూడ పట్టణంలోని ఏచూరి శ్రీనివాసరావు ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్‌లో జరిపిన తనిఖీలో సింజెంటా కంపెనీ పేరు కలిగిన రూ.53వేల విలువైన నకిలీ చెస్, పురుగుమందులను గుర్తిం చి సీజ్ చేసినట్లు డీఏవో తెలిపారు. మిర్యాలగూడలో పట్టుబడ్డ నకిలీమందులపై ఆరాతీయగా దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామానికి చెందిన డీలర్ సజ్జల రాజిరెడ్డి సరఫరా చేసినట్లు గుర్తించామన్నారు. మిర్యాలగూడ కు చెందిన రాజశేఖర్‌రెడ్డి, రమేష్‌బాబు అనే వ్యాపారులు ఇచ్చిన సమాచా రం మేరకు వీర్లపాలెం గ్రామంలోని ఆగ్రోస్‌రైతు సేవా కేంద్రంలో తనిఖీలు జరపగా సుమారు రూ.1.50లక్షల విలువైన నకిలీ చెస్‌మందు డబ్బాలు లభ్యమైనట్లు అధికారులు తెలిపారు. పట్టుబడ్డ మందులను స్వాధీనం చేసుకుని షాప్‌ను సీజ్‌చేసి, డీలరు రాజిరెడ్డి లైసెన్స్ రద్దు చేసినట్లు జేడీఏ తెలిపారు. అదేవిధంగా మిర్యాలగూడకు చెందిన ఏచూరి శ్రీనివాసరావు, రాజశేఖర్‌రెడ్డి అనే డీలర్ల లైసెన్స్‌లను కూడా అధికారులు రద్దుచేశారు. అయితే నకిలీ చెస్‌మందును గుంటూరు జిల్లా నుంచి సరఫరా చేస్తున్న ధనావత్ రమేష్, గుట్టుగా విక్రయిస్తున్న డీలరు రాజిరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వాడపల్లిపోలీసులకు ఫిర్యాదుచేసినట్లు జేడీఏ తెలిపారు. తనిఖీలో ఏవోలు డీ సైదానాయక్, సరిత పాల్గొన్నారు.



దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలోని ఆగ్రోస్‌రైతుసేవా కేంద్రంలో నకిలీ మందులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



నల్లగొండ జిల్లా కేంద్రంలోని బ్రహ్మంగారి గుట్ట పైనుంచి గురువారం కనిపిస్తున్న సుందర దృశ్యం

వర్షించే మేఘం హర్షించే రాగం

నైరుతీ రుతుపవనాలు ముగిసి చలికాలం తరుముకొస్తోంది.. ఉదయాన్నే సూరీడు సైతం ఆలస్యంగా మేలు కొంటున్నాడు.. తామింకా వెళ్లలేదన్నట్లుగా మేఘాలు విహరిస్తూ కనిపిస్తున్నాయి. మేమున్నామంటూ వాటి వెంటే చల్లని గాలులు వస్తున్నాయి. వారం రోజులుగా ఈ వాతావరణం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కనిపిస్తోంది. అక్కడక్కడా చిరుజల్లులు కురుస్తున్నాయి. కోతకొచ్చిన పంట చేల మీదుగా వెళ్తున్న మేఘాలు చూపులను తిప్పుకోలేనంతగా ప్రకృతికి అందాన్ని చేకూరుస్తు న్నాయి. ఆహ్లాదకర వాతావరణంలో పంట చేలల్లో కూలీలు, రైతులు పనులు చేసుకుంటూనే ఎక్కడ వర్షిస్తాదో అన్న భయంతో అటుగా వెళ్తున్న మేఘాలను ఓ కంట కనిపెడుతూనే ఉన్నారు. (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)


యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలకేంద్రం సమీపంలో పచ్చని పొలాల మీదుగా మేఘాలు

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	590.00
టీఎంసీలు	312.0450
ఎడమకాల్వకు నీటి విడుదల	6,173
కుడికాల్వకు	8,067
విద్యుత్ కేంద్రం ద్వారా	29,557
సాగర్‌కు నీటి రాక	67,637
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	78,997 క్యూసెక్కులు

- నాగార్జునసాగర్, (ఆంధ్రజ్యోతి)

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	44.33 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	58,535
నీటి విడుదల	57,596

- మేళ్లచెర్వు,(ఆంధ్రజ్యోతి)

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.30 అడుగులు
టీఎంసీలు	4.28
ఇన్‌ఫ్లో	1390.26 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	771.72 క్యూసెక్కులు

- కేతేపల్లి,(ఆంధ్రజ్యోతి)

శాలిగౌరారం

పూర్తి స్థాయి నీటిమట్టం	21 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం	19 అడుగులు

- శాలిగౌరారం,(ఆంధ్రజ్యోతి)

డిండి

పూర్తి స్థాయి నీటిమట్టం	36 అడుగులు
టీఎంసీలు	2.4
ప్రస్తుత నీటిమట్టం	36 అడుగులు
ఇన్‌ఫ్లో	3750 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	3750 క్యూసెక్కులు

-డిండి,(ఆంధ్రజ్యోతి)

ముల్కలపల్లి ఘటనపై పోలీసుల చర్యలు

● కానిస్టేబుల్ సత్యనారాయణ సస్పెన్షన్ ● సీఐ ధనుంజయ్‌కు చార్జి మెమో

గుర్రంపోడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని ముల్కలపల్లిలో సంచలనం సృష్టించిన వివాహిత హత్య కేసును ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించిన పోలీసు అధికారులపై సస్పెన్షన్ వేటు, చార్జీ మెమోలు జారీ అయ్యాయి. మండలంలోని ముల్కపల్లి గ్రామానికి చెందిన జాల రజిత(30) అనే వివాహిత ఆగస్టు 29న హత్యకు గురైంది. సమాచారం మేరకు అక్కడ చేరుకున్న పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. భర్త దుర్గయ్య ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన జాల రాములును అరెస్టు చేశారు. కాని ఈ కేసులో ప్రమేయమున్న జాల రాములు, భార్య పార్వతమ్మ. ఆయన అన్న కుమారుడు వెంకటయ్యను తప్పించేందుకు భారీగా ముడుపులు తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఏఎస్పీ రాములునాయక్ ఆధ్వర్యంలో విచారణ జరిపించారు. పోలీసు కానిస్టేబుల్ సత్యనారాయణ ద్వారా ఎస్‌ఐ వేమిరెడ్డి నారాయణరెడ్డి రూ.లక్ష లంచం తీసుకొని అవినీతికి పాల్పడినట్లు తేలడంతో ఎస్పీ నివేదిక మేరకు మల్టీజోన్-2 ఐజీసీ సత్యనారాయణ, ఎస్‌ఐ వేమిరెడ్డి నారాయణరెడ్డిని సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సంఘటనలో ప్రమేయమున్న కానిస్టేబుల్ సత్యనారాయణను సస్పెండ్ చేస్తూ ఎస్పీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కొండమల్లేపల్లి సీఐ ధనుంజయగౌడ్‌కు చార్జి మెమో జారీ చేశారు.

మతిస్థిమితం లేని వ్యక్తి కాల్వలో దూకి ఆత్మహత్య


గోపికిషోర్‌మృతదేహం

త్రిపురారం అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేనివ్యక్తి కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా త్రిపురారం మండలంలోని గంటారావుక్యాంపులో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం పట్టణంలోని సాయిగణేష్‌నగర్‌కు చెందిన కన్నెగంటి గోపికిషోర్(57) నాలుగు సంవత్సరాల నుంచి మానసిక ఆరోగ్య పరిస్థితి బాగాలేక పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తుండడంతో కుటుంబసభ్యులు ఖమ్మంలోని ఆస్పత్రిలో చూపించారు. కొన్ని రోజులు మంచిగా ఉండేవాడు. తర్వాత కొన్ని రోజులు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేవాడు. ఈ నెల 12వ తేదీన తన ఇంటి నుంచి వెళ్లాడని గురువారం ఉదయం సుమారు 7గంటల సమయంలో గంటారావుక్యాంపు వద్ద ఉన్న ఉన్న ముదిమాణిక్యం మేజర్ కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని గోపికిషోర్ కుమారుడు హరిదీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గోపి కిషోర్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉంది.

అనుమానాస్పదస్థితిలో బాలుడు మృతి


దత్తు(ఫైల్)

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని బాలుడు అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన సంఘటన నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలం మూనావత్ తండాలో గురువారం జరిగింది. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన మూనావత్ మోహన్-లీలా దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. మొదటి వాడైనా మూనావత్ దత్తు(12) హైదరాబాద్‌లోని హాస్టల్‌లో ఉంటూ 7వ తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులు రావడంతో ఇంటికి వచ్చారు. సెలవులు ముగియడంతో బుధవారం హైదరాబాద్‌కు బయలుదేరాల్సి ఉండగా వ్యవసాయ పనులు ఉండడంతో తండ్రి మోహన్ గురువారం వెళ్లామని అని చెప్పడంతో ఆగిపోయాడు. బుధవారం వ్యవసాయ బావి వద్ద దత్తు తాతతో పాలి వారు అయిన మునావత్ బెల్లు అతని కుమారులు ఘర్షణ పడ్డారు. అదే రోజు సాయంత్రం మోహన్ కుమారుడు దత్తు ఇంట్లో ఎవరూ లేని సమయంలో కిటికీకి ఉరివేసుకుని అనుమానాస్పదస్థితిలో మృతిచెంది విగతజీవిగా పడి ఉన్నాడు. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికులు గుడిపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాత్రి పొద్దుపోవడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఎలాంటి ఆవాంఛనీయ సంఘ టనలు జరగకుండా బందోబస్తును ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం కొండమల్లేపల్లి సీఐ ధనంజ య్యగౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేప ట్టారు. అనంతరం కుటుంబసభ్యులతో మాట్లాడి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ మార్చురీకి తరలించారు. హత్యనా ?, ఆత్మహత్యనా? నిర్ధారించేందుకు మృతదేహాన్ని నల్లగొండ మెడికల్ కాలేజీకి తరలించారు. అక్కడ పోస్టు మార్టం పూర్తిచేసి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. తన కొడుకు మృతిపై తన పాలివారు అయిన మూనావత్ బెల్లు, అతని కుమారులపై అనుమానం ఉందని మోహన్ తెలిపారు. కొద్ది రోజులుగా భూమి పంచాయితీ జరుగుతోందని, వారే చంపేసి ఉంటారని తండ్రి మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.

రైలుకు ఎదురెళ్లి..

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): క్రిమిసంహారక మందుసేవించిన తర్వాత రైలుకు ఎదురుగా వెళ్లి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం వెలుగులోకి వచ్చింది. రైల్వే ఎస్‌ఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ- కొండ్రపోల్ రైల్వేమార్గంలో 115/8 మైలురాయి వద్ద రైలు పట్టాలపై గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, మృతుడి ఆచూకీ కోసం ప్రయత్నించామని తెలిపారు. సంఘటన జరిగిన పరిసరాల్లో గాలింపు చర్యలు చేపట్టగా రైల్వేస్టేషన్ హోం సిగ్నల్ వద్ద లభ్యమైన కాలేజీ బ్యాగులో ఐడీకార్డు ఆధారంగా మృతుడి వివరాలు తెలుసుకున్నట్లు రైల్వే ఎస్‌ఐ తెలిపారు. ఆత్మహత్యకు పాల్పడ్డ యువకుడు త్రిపురారం మండలం అల్వాలపాడు గ్రామానికి చెందిన చిర్ర శ్రవన్‌కుమార్ (18)గా నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కాగా చిర్ర మల్లయ్య రెండో కుమారుడైన శ్రవన్‌కుమార్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన శ్రవన్‌కుమార్ కాలేజీ హాస్టల్‌కు వెళ్తున్నట్లు తల్లిదండ్రులతో చెప్పి బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకొచ్చాడు. గురువారం రాత్రి గుర్తు తెలియని రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వేపోలీసులు తెలిపారు. మృతదేహం పక్కన క్రిమిసంహారక మందుడబ్బా పడి ఉందని, అందులోని మందును సేవించి రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు అభిప్రాయపడుతు న్నారు. ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం పూర్తిచేసి బంధువులకు అప్పగించి, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు.


శ్రవన్‌కుమార్ (ఫైల్)

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దివ్యక్షేత్రంలో నిత్య కైంకర్యాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకారమండపంలో ఉత్సవమూర్తులను గజవాహన సేవలో తీర్చిదిద్ది సేవోత్సవం చేపట్టారు. అనంతరం కల్యాణతంతు కొనసాగింది. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని రామ లింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 13,23604 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, స్వామివారి దివ్యవిమాన రాజగోపురం బంగారు తాపడానికి హైదరాబాద్‌లోని సైదాబాద్‌కు చెందిన కంకర్ సుధీర్‌రెడ్డి రూ.10,00,116 విరాళం ఈవోకు అందజేశారు.

కొండపైన కొత్త షెడ్డు నిర్మాణం

స్వామివారి ఆలయంలో దూర ప్రాంతాల నుంచి వచ్చే దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేకంగా షెడ్డు నిర్మిస్తున్నారు. ప్రోటోకాల్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో వీఐపీ పార్కింగ్ ప్రదేశానికి ఎదురుగా 80/11 ఫీట్ల విస్తీర్ణంలో సుమారు రూ.5లక్షలతో చేపట్టిన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. అయితే ఆ రోడ్డుపై పూర్తిగా షెడ్డు నిర్మిస్తే రెండు వేల మంది భక్తులకు ఎండా, వాన నుంచి రక్షణగా ఉంటుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రాన్ని కాపాడుకుందాం: సుమన్


ఆశీర్వచన మండపంలో నటుడు సుమన్, ఆయన కుమార్తె ప్రత్యూష

యాదగిరిగుట్ట ఆలయంలో లోపలికి వెళ్తే ఆధ్యాత్మిక ప్రపంచంలోకి వెళ్లినట్లు ఉం టుంది.. ఇంత అద్భుతమైన గుడిని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని సినీ నటుడు సుమన్ పిలుపునిచ్చారు. గురువారం ప్రధానాలయంలో లక్ష్మీనృసింహుడిని కుమార్తె ప్రత్యూష, బంధువులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా సుమన్ తిరువీధుల్లో విలేకరులతో మాట్లాడుతూ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాల్లో పరిశుభ్రతను కాపాడుకుందామన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఆలయాన్ని అద్భుతంగా నిర్మించారని, అందుకు అనుగుణంగా ఇక్కడి అధికారులు కూడా పరిశుభ్రతను పాటిస్తున్నారన్నారు. దేశం గర్వించేలా కాకతీయుల శిల్పాకళా సంపదకు ఏమాత్రం తీసిపోకుండా నిర్మించడం ఆనందకరమన్నారు. నిర్మాణంలో ఉన్నప్పుడు క్షేత్ర సందర్శనకు వచ్చానని, ఇప్పుడు స్వామిని దర్శించుకునేందుకు అవకాశం లభించిందన్నారు. ఆలయం లోపలికి వెళ్లేటప్పుడే సమస్యలను మరిచి భక్తి భావం కలిగి ఆధ్యాత్మిక లోకంలోకి అడుగు పెడుతున్న అనుభూతిని ప్రతి భక్తుడు పొందుతున్నాడని అన్నారు.

సందడిగా లతీఫుల్లా ఉర్సు

నల్లగొండ జిల్లా కేంద్రంలో లతీఫుల్లా షాఖాద్రీ ఉర్సు ప్రారంభమైంది. కులమతాలకు అతీతంగా ఈ ఉర్సులో పాల్గొంటుంటారు. దక్షిణ భారతదేశంలోనే గుట్టపై ఉన్న ఏకైక దర్గాగా లతీఫుల్లా ఖాద్రీ దర్గా ప్రసిద్ధి. గురువారం రాత్రి జరిగిన కార్యక్రమాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దీంతో గుట్ట చుట్టుపక్కల ప్రాంతం సందడిగా కనిపించింది. క్లాక్‌టవర్ సెంటర్ నుంచి పాతబస్తీ వైపుగా వెలిసిన దుకాణాల్లో భక్తులు పలు వస్తువులను కొనుగోలు చేశారు. గంధం ఊరేగింపు సందర్భంగా కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది.


ఉర్సు సందర్భంగా లతీఫ్ గుట్ట వద్ద సందడి


గంధాన్ని మోసుకెళ్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి,




గంధం ఊరేగింపులో పాల్గొన్న డప్పు వాయిద్య కళాకారులు, సమాధి వద్ద భక్తులు

అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలి

● *సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్*

తుర్కపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని జేఎం ఫంక్షన్ హాల్లో గురువారం నిర్వహించిన సీపీఎం 8వ మహాసభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల ఇస్తామని చెప్పిందే తప్పా పేదలకు మాత్రం డబుల్ బెడ్‌రూం ఇవ్వలేదని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం నామినేటెడ్ కమిటీలను ఏర్పాటు చేసి ఆ కమిటీల ద్వారా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక చేసే ఆలోచన సరైనది కాదన్నారు. అంతకు ముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, మండల కార్యదర్శి పోతరాజు జహంగీర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశ్, పీఎన్ఎం జిల్లా కార్యదర్శి పి. ముత్యాలు, నాయకులు కొక్కొండ లింగయ్య, నర్సింహ, మాతయ్య, వెంకటేశ్, కళమ్మ పాల్గొన్నారు.

తెల్లరేషన్ కార్డులు ఇవ్వాలి

ఆలేరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆలేరు పట్టణంలో అర్హులైన పేదలందరికి ప్రభుత్వం వెంటనే తెల్లరేషన్ కార్డులు పంపిణీ చే యాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎంఏ ఇక్బాల్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని రంగనాయక వీధిలో జరిగిన పార్టీ 5వ శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. 20 ఏళ్లుగా పేదలకు రేషన్ కార్డులు లేకపోవడంతో పేదలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశా రు. అనంతరం వార్డు శాఖ కార్యదర్శిగా భువ నగిరి గణేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయ కులు గణగాని మల్లేశం, గణేష్, కోరుటూరి ఉపేందర్, గణ గాని రాజు, అమీర్, బాలరాజు, మధు, నవీన్, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

ఆత్మకూరు(ఎం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రా లను ప్రారంభించి వెంటనే వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వేముల బిక్షం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కూరెళ్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు నిల్వ చేసిన ధాన్యం రాశులను సీపీఎం ఆధ్వర్యంలో గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా బిక్షం మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోలు చేసే దిక్కులేక రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయిస్తూ నష్టపోతున్నారని ఆరోపించారు. ఆయన వెంట నాయకులు టి.యాదయ్య, ఎం.మల్లయ్య, బుగ్గయ్య, ఎం.సత్తయ్య, సోమయ్య, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.



తుర్కపల్లి : సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న ఎండీ జహంగీర్

దళారులను నమ్మి మోసపోవద్దు : ప్రభుత్వ విప్

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైతులు మధ్య దళారులను నమ్మి మోస పోవద్దని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. పీఏసీఎస్ యాదగిరిగుట్ట ఆధ్వర్యంలో మండలం నుంచి కాచారం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించే ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మధ్య దళారులకు ఎవరికి విక్రయించవద్దని రైతులకు సూచిం చారు. కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ చైతన్యరెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ ఇమ్మిడి రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ సుగుణారాంరెడ్డి పాల్గొన్నారు.

పంట రుణాల కోసం 25లోపు దరఖాస్తు చేసుకోవాలి

మోత్కూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు రైతు సేవాసహకార సంఘంలో రైతులకు పంట రుణాల కోసం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు రూ.50 లక్షల మంజూరు చేసిందని ఆ సంఘం ఛైర్మన్ పేలపూడి వెం కటేశ్వర్లు తెలిపారు. సంఘం కార్యాలయంలో గు రువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు పంట రుణాల కోసం ఈ నెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంఘం ఆధ్వ ర్యం లో మెయిన్ రోడ్డుకు నిర్మించిన షెటర్లు కావాల్సిన వారు అద్దెకు తీసుకోవచ్చన్నారు. నెల అద్దె రూ.6 వేలు ఉంటుందని, రూ.30 వేలు అడ్వాన్స్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. త్వరలోనే మోత్కూరు, పొడిచేడు, అనాజిపురం, రహీం ఖా న్‌పేట, కప్రాయపల్లి, దత్తప్పగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు.

దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ

మోత్కూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మోత్కూరు ఎస్ఐ నాగరాజు కోరారు. మండలంలోని అనాజిపురం గ్రామంలో గురువారం రాత్రి ఆయన ప్రజలకు దొంగతనాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు, పొలం పనులకు వెళ్లేవారు విలువైన వస్తువులు ఇంట్లో ఉండకుండా చూసుకోవాలని, బీరువాల్లో దాచకుండా రహస్య ప్రదేశాల్లో దాచుకో వాలన్నారు. ఫోన్లలో గుర్తు తెలియని వ్యక్తులు అడిగే సమాచారం, ఓటీపీని ఎవరికీ చెప్ప వద్దన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండా లన్నారు. మహిళలు, పిల్లలు జాగ్రత్తగా ఉండాలని బాధితులు వెంటనే 100 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి : డీఏఓ

బీబీనగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ సూచించారు. మండల కేంద్ర పరిధిలోని ఇసురాయిపల్లి కుంటలో క్షేత్రస్థాయిలో గురువారం వరి పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సన్నరకం ధాన్యం విక్రయానికి ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలతో విత్తనాలు, ఎరువులు, పురుగుల మందు వాడాలని సూచించారు. అనంతరం సీడ్స్ దుకాణాలను సందర్శించి పరిశీలించారు. రైతులకు ఎమ్మార్పీ రేట్లకే ఎరువులు, పురుగుల మందులు విక్రయించాలని వారికి సూచించారు. ఆయన వెంట ఎంఏవో పద్మ, ఏఈవో ఉమామహేశ్వరి ఉన్నారు.



బీబీనగర్ ఇసురాయిపల్లి కుంటలో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలిస్తున్న డీఏఓ గోపాల్

రైతుల్లో గుబులు

(మొదటి పేజీ తరువాయి)

ఎకరాల వరకు వరి సాగైంది. మొత్తం 5లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం దిగు బడి అవుతుందని అంచనా.

ధాన్య కొనుగోళ్లకు సన్నాహాలు

మూసీ పరివాహక ప్రాంతాలతో పాటు పలు చోట్ల వరికోతలు పూర్తయి కేంద్రాలకు ధాన్యాన్ని రైతులు తరలించేందుకు సన్నాహా లు చేస్తున్నారు. పలుచోట్ల కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని ఆరబెట్టారు. వీలైనంత త్వరగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే పలుచోట్ల కొనుగోలు కేంద్రాలను తెరి చేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రైతులు మాత్రం వెంటనే కేంద్రాలను ఏర్పాటుచేయా లని కోరుతున్నారు. జిల్లాలో మొత్తం 323 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయను న్నారు. వీటిలో ఐకేపీ 90 కేంద్రాలు, పీఏసీఎస్ 220తో పాటు మరో 13 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వర్షాలు కురుస్తున్నందున కేంద్రాల్లో ధాన్యం తడవకుండా ఉండేందుకు 3,567 టార్పాలీన్లు సిద్ధంగా ఉంచారు. తేమ శాతం చూసే యంత్రాలు 323, కాంటాలు 476, ప్యాడీ క్లీనర్లు 228 వరకు అందుబా టులో ఉన్నాయి. అయితే కోతలు పూర్తయ్యే చోట్ల వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

'పీఆర్‌సీని అమలు చేయాలి'

రాజాపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏలను విడుదల చేసి పీఆర్‌సీని అమలు చేయాలని తపస్ రాష్ట్ర నాయకుడు సీవీ శ్రీనివాస్ ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రాజా పేట మండల కేంద్రంలో తపస్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఉపాధ్యా యుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎల్ శ్రీనివాస్, గిరి ప్రసాద్, జానయ్య, సత్యానందం, శ్రీహరి, రాజు పాల్గొన్నారు.

'అన్య మతస్థులను అనుమతించొద్దు'

భువనగిరి అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి పాదాల చెంత జంతువధకు అన్యమతస్థులను అనుమతించొద్దని స్థాని కులు కోరారు. యాదగిరికొండపై ఈవో ఏ. భాస్కర్‌రావుకు వినతి పత్రం అందజేసిన అనంతరం పలువురు మాట్లాడారు. హిందూ దేవాలయాల్లో అన్యమతస్థుల ఆచారాలు పాటిస్తున్నారని ఆరోపించారు. భక్తుల మనోభావాలకు ఇబ్బందులు కలిగేలా అన్య మతస్థులు వారి ఆచారాలు కొనసా గిస్తున్నారన్నారు. బండి అనిల్, నర్సింహ, కర్ణ, నవీన్, ప్రశాంత్, ప్రవీణ్ ఉన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ వెంటనే చేపట్టాలి : బీజేపీ

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు సుర్కంటి రంగారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు ధనుంజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గౌసుకొండ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం వారు సందర్శించారు. రైతుల సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కోతలు ముగిసినా కొనుగోళ్లు చేపట్టడంలో ప్రభుత్వం విఫల మైందన్నారు. అనంతరం గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్ర మంలో పార్టీ నాయకులు కర్నాటి ధనుంజయ, బీజేపీ మండలాధ్యక్షుడు గుండ్ల రాజుయాదవ్, జిల్లా సభ్యత్వ ప్రముఖ్ రాచకొండ కృష్ణ, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఫకీరు రాజేందర్‌రెడ్డి, జిల్లా నాయకులు మేకల చొక్కారెడ్డి, పల్లెకాడి బసవయ్య, దోసపాటి అంజయ్య, దేవేందర్‌గౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుతోనే పార్టీ బలోపేతం

తుర్కపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : సభ్యత్వం తోనే పార్టీ బలోపేతమవుతుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూరి అశోక్ గౌడ్ అన్నారు. మండలంలోని మాదాపూర్ గ్రామంలో గురువారం పార్టీ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి ఆన్‌లైన్, ఆఫ్ లైన్ ద్వారా పార్టీ సభ్యత్వం కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించచారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు యాట పెంటయ్య, జిల్లా నాయకులు మేకల పాండు, మేకల శ్రీనివాస్, ఆకుల రమేశ్, నాయకులు కొక్కొండ లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, పాముల రాంచంద్రం, చిల్కూరి రమేశ్, ప్రవీన్, బిక్షపతి, సిద్ధేంకి మురళి, పిడుగు లక్ష్మయ్య పాల్గొన్నారు.

● బీబీనగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో బీజేవైఎం నాయకులు గురువారం సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్ , సదానందన్ గౌడ్, మండలాధ్యక్షులు కసగోని వంశీ గౌడ్ పాల్గొన్నారు.



భూదాన్‌పోచంపల్లి: గౌసుకొండ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలి : ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ

భువనగిరి రూరల్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన మిషన్ భగీరథ మంచి నీటిని అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కరుణాకర్, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. భువనగిరి మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాల్‌లో గురువారం మిషన్‌భగీరథ సహాయకుల శిక్షణ సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు పరిశుభ్రమైన నీటి అందించేందుకు ఇలాంటి శిక్షణ ఎంత గానో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈ వి గుండురావు, పీఆర్ఏఈ రాకేశ్, ఎంపీవో దినకర్ గౌడ్, ఫాల్కాన్ కంపెనీ ప్రతినిధి ఫిరోజ్‌ఖాన్, పీవో బీరప్ప పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న అధికారులు

సాయి బాబా ఆలయ వార్షికోత్సవం

ఆలేరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయ 24 వ వార్షికోత్సవ పూజలు గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ ఆచార్య ఆధ్వర్యంలో కలశ పూజలతో ఈ ప్రజలు ప్రారంభమయ్యాయి. ముందుగా గణపతి పూజ, పుణ్యాహచనం నిర్వహించారు. సందర్భంగా సాయిబాబాను 108 కలశాలతో మహాభిషేకం నిర్వహించి బాబాను నూతన వస్త్రాలతో అలంకరించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హాజరై బాబాను దర్శించుకొని ఆశీర్వచనం పొందారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వెనుశెట్టి సుధాకర్, గంధ అంజయ్య, బొట్ల పరమేశ్వర్, మురారిశెట్టి రాజేశ్వర్, చొల్లేటి సుదర్శన్, పలువురు పాల్గొన్నారు.

జైళ్లల్లో కుల వివక్షను రూపుమాపాలి : ఐలూ

భువనగిరి గంజ్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జైళ్లలో నెలకొన్న కులవివక్షను రూపుమాపాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) జిల్లా అధ్యక్షుడు మామాడి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. భువనగిరి కోర్టుఆవరణలో గురువారం నిర్వహించిన ఐలూ సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టో బరు 3న సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ప్రభుత్వాలు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. సమా వేశంలో ఐలూ ఉపాధ్యక్షుడు కుక్కదువు సోమయ్య, పాల్వంచ జగతయ్య, తడక మోహన్, సహాయ కార్యదర్శులు సీసా శ్రీనివాస్, బొల్లపల్లి కుమార్, చింతల రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పశువ్యాధుల నివారణకు జాగ్రత్తలు చేపట్టాలి

ఆలేరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పశువులకు వ్యాపించే వ్యాధుల పట్ల రైతులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ మండల అధికారులు డాక్టర్ చైతన్య, డాక్టర్ నవీన్‌రెడ్డి కోరారు. మండలంలోని ఆలేరు, కొలనుపాక, తూర్పుగూడెం, గ్రామాల్లో గురువారం నిర్వహించిన గాలికుంటు వ్యాధి నివారణ టీకా శిబిరం నిర్వహించి 294 గేదెలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో వీఎల్‌వోలు శ్రీనివాస్, వరలక్ష్మీ, నరసింహస్వామి, శ్రీకాంత్, గోపి, కృష్ణ, అశోక్, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల రాష్ట్ర మహా సభలు విజయవంతం చేయాలి

రామన్నపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈ నెల 25, 26 తేదీల్లో జరిగే దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర 4వ మహాసభలు జయప్రదం చేయాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్యదర్శి వనం ఉపేందర్ తెలిపారు. మహాసభలకు ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క, టీపీసీసీ రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రామన్నపేట బొడ్డుపల్లి వెంకటేశం, బలుగూరి అంజనేయులు, లింగస్వామి, చంద్రమౌళి పాల్గొన్నారు.

మునిసిపల్ వైస్ చైర్మన్ దశరథ జన్మదిన వేడుకలు



రాయిగిరి అనాథాశ్రమంలో అన్న దానం చేస్తున్న అభిమానులు

భువనగిరి టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : భువనగిరి మునిసిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ జన్మదిన వేడుకలను గురువారం భువ నగిరి పట్టణంలోని నిర్వహించారు. ఈ సంద ర్భంగా కేక్ కట్ చేసి పంచి పెట్టారు. జిల్లా ఆస్పత్రి, రాయిగిరిలోని సహృదయ అనాథ వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. వైస్ చైర్మన్‌గా బీజేపీ నేతగా ప్రజాసమస్యల పరిష్కారానికి అయన చేస్తున్న కృషిని పలు వురు కొనియాడారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద మహేందర్‌గుప్తా, జిల్లా ఉపాధ్యక్షుడు జెన్నపల్లి శ్యాంసుందర్‌రెడ్డి, కౌన్సి లర్ జనగాం కవితానర్సింహచారి, నాయకులు రత్నపురం శ్రీశైలం, కొండం ఉపేందర్‌గౌడ్, ఎదగాని సంతోష్, ఎండీ మహ్మద్, బూరుగు మణికంఠ పాల్గొన్నారు.

విద్యార్థి బలవన్మరణం

భువనగిరి రూరల్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): భువనగిరి మండలం గౌస్‌నగర్ గ్రామంలో ఈనెల 14న పురుగుల మందు తాగి బల వన్మరణానికి యత్నించిన బాలుడు చికిత్స పొం దుతూ గురువారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన భూషబోయిన వెంకటేశ్ యాదవ్, కేత మ్మ దంపతుల చిన్న కుమారుడు భూషబోయిన శ్రావణ్‌కుమార్ యాదవ్(15) భువనగిరి పట్ట ణంలో సాయి ప్రశాంతి హైస్కూల్‌లో 8వ తర గతి చదువుతున్నాడు. ఈనెల 14న సాయంత్రం శ్రావణ్‌కుమార్ తండ్రి వెంకటేశ్‌తో కలిసి వ్యవసాయ బావి వద్దకు వెళ్లి ఆవు పాలు పితికి తెచ్చి పాల సెంటర్‌లో పోసి ఇంటికి వెళ్లారు. అందరూ కలిసి రాత్రి భోజనం చేసిన అనం తరం శ్రావణ్‌కుమార్ విరేచనాలు చేసుకుంట ుండగా తల్లిదండ్రులు శ్రావణ్‌ను ప్రశ్నించారు. దాంతో వ్యవసాయబావి వద్ద గల పురుగుల మందు తాగినట్లు చెప్పడంతో వెంటనే జిల్లా కేంద్రంలోని కేంద్ర ఆసుపత్రికి అక్కడి నుంచి సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. అయితే శ్రావణ్‌కుమార్ యాదవ్ ఎప్పుడు ఒంటరిగా ఉంటూ ఎవ్వరితో మాట్లాడ కుండా ఎప్పుడు ఏదో ఒకటి ఆలోచిస్తూ తన కుమారుడి మృతిపై ఎలాంటి అనుమానం లేదని తండ్రి వెంకటేశ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భు వనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో వారణాసి సంతోష్‌కుమార్ తెలిపారు.

మెమో ఇవ్వలేదని విద్యార్థిని కొడతారా?

ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌ను నిలదీసిన తల్లిదండ్రులు

భువనగిరి టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి మార్కుల మెమో ఇవ్వలేదని తమ కుమారుడిని ఎందుకు కొట్టారని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌ను తల్లిదండ్రులు నిలదీశారు. గురువారం జిల్లా కేంద్రంలో ఈ సంఘ టన జరిగింది. విద్యార్థి, తల్లిదండ్రుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నా యి. మోత్కూరు మండల కేంద్రానికి చెందిన శివకుమార్ భువనగిరి పట్టణం లోని సిద్ధార్థ ఐటీఐ కళాశాలలో ఐదు నెలల క్రితం వెల్డర్‌ట్రేడ్‌లో చేరాడు. ప్రవేశ సమయంలోనే అన్ని సర్టిఫికెట్లు అందజేశాడు. కానీ పదోతరగతి లాంగ్ మెమో అందుబాటులో లేకపోవడంతో కళాశాలలో ఇవ్వలేదు. దాంతో కళాశాల ప్రిన్సిపాల్ మోహ న్‌రెడ్డి కొన్ని రోజులుగా పదో తరగతి మెమో తీసుకురావాలని శివకుమార్‌కు సూచిస్తున్నా ఇవ్వకుండా దాట వేస్తున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం ప్రిన్సిపాల్ శివకుమార్‌ను పదో తరగతి మెమో తేవాలని ఒత్తిడి చేశారు. మర్నాడు ఇస్తానని, తప్పనిసరి అంటే ఇప్పుడే మోత్కూరుకు ఇంటికి వెళ్లి సాయంత్రం వరకు ఇస్తానని ప్రిన్సిపాల్‌కు తెలిపాడు. అయినా సహనం కోల్పోయిన ప్రిన్సిపాల్ ఆగ్రహంతో తనను కర్రతో కొట్టడంతో చేతిపై వాతలు వచ్చినట్లు శివకుమార్ తెలిపారు. సమాచారం అందుకున్న శివ కుటుంబసభ్యులు, పలు సంఘాల ప్రతినిధులు కళాశాలకు చేరుకుని ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. ప్రిన్సిపాల్ తమ పట్ల దురుసుగా ప్రవర్తి స్తున్నాడని, తరచుగా అసభ్యంగా దూషి స్తాడని పలువురు విద్యార్థులు పేర్కొన్నారు. విద్యార్థిని గాయపర్చిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ సమితి ప్రతినిధి కోడారి వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ లాంగ్ మెమోను ఇవ్వమని శివకుమార్‌కు సూచిం చానని, తాను అతడిని కొట్టలేదని పేర్కొన్నారు.



కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న కుటుంబసభ్యులు, చిత్రంలో శివకుమార్

సంక్షిప్త సమాచారం...

● బీబీనగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) :బీబీనగర్ పట్టణానికి చెందిన పొట్ట అశోక్ కృష్ణవేణి దంపతుల కూతురు లహరికకు జబల్‌పూర్ ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. ఉన్నత చదువులకు ఆర్థిక ఇబ్బంది పడుతుండడంతో పీఎన్‌కే టీం సభ్యులు రూ.20వేల నగదును గురువారం తల్లిదండ్రులకు అందజేశారు.

● భువనగిరి రూరల్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి) : మండలం తాజ్‌పూర్‌కు చెందిన లతీఫ్‌బీ ఇటీవల మృతి చెందారు. ఆమె కుటుంబానికి డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ రూ.5వేలు అందజేశారు.

● ఆలేరు రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : దేశంలో ఉన్న విప్లవ పార్టీలన్నీ ఏకం కావాల్సిన అవసరం ఉందని సీపీఐ ఎంఎల్ ఎన్‌డీఆర్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కోమటిరెడ్డి అనంతరెడ్డి అన్నారు. గురువారం ఆలేరులో జరిగిన ఆ పార్టీ ప్రథమ ఆవిర్భావ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలోని సహజ ప్రకృతి సంపదను దోచుకునేందుకు బహుళ జాతి సంస్థలు కుట్రలు పన్నుతున్నాయన్నారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర, జిల్లా, నాయకులు పంగ రవి, అంజయ్య, మల్లేష్, బాలమల్లేష్, చంద్రయ్య, వరలక్ష్మీ, రాజ్యం, గణేష్, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

● మోటకొండూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఐ సహాయ జిల్లా కార్యదర్శి బొలగాని సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్య క్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గడెగాని మాణిక్యం, సహాయ కార్యదర్శి ముస్కు పెంటారెడ్డి, బోళ్ల శ్రీనివాస్, మంచాల రాధమ్మ, పల్లె వెంకన్న, సుదగాని వెంకన్న, పాండు పాల్గొన్నారు.

● భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): : పట్టణంలోని అచల పరిపూర్ణ సత్సంగ ఆశ్రమం 35వ వార్షికారాధన మహోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్సంగ మండలి అధ్యక్షుడు చక్రాల నర్సింహ ఆధ్వర్యంలో ప్రభాత సేవ, అఖండ దీపారాధన, గీతా పారాయణం, నగర సంకీర్తన, ధ్వజారోహణం, గురుపూజ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో పరిపూర్ణ సత్సంగ ఆశ్రమం వ్యవస్థాపక మండలి సభ్యులు తడక ముత్యాలు, మండలి అధ్యక్షుడు చక్రాల నర్సింహ, ప్రధాన కార్యదర్శి దోర్నాల నర్సింహ పాల్గొన్నారు.

● రామన్నపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : రామన్నపేట పట్టణానికి చెందిన సింగిల్ విండో మాజీ చైర్మన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రంగా సంపత్‌కుమార్ (66) గుండెపోటుతో గురువారం హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆయన మృతికి ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

● భువనగిరి టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ మా జీ గవర్నర్ డాక్టర్ తిరునగరు రంగయ్య అందించిన రూ. 23వేల విలువైన మైక్‌సెట్‌ను భువనగిరిలోని ప్రభుత్వ భగాయత్ జడ్పీ హెచ్‌ఎం సత్యనారాయణరెడ్డికి గురువారం రోటరీ క్లబ్ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ న్యూ క్లబ్ చైర్మన్ డాక్టర్ ఎంపల బుచ్చిరెడ్డి, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కరిపే నర్సింగ్‌రావు, కూచిపట్ల సత్యనారాయణరెడ్డి, మంచికంటి వెంకటేశం, ఇటికల దేవేంద్రచారి, కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, పాల్గొన్నారు.

● భువనగిరి టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నాలుగు రోజులుగా మూసివేస్తున్న ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలను వెంటనే తెరవాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నురుపంగా చందు కోరారు. గురువారం భువనగిరిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వంపై బురద చల్లేలా యాజమాన్యాల వైఖరి ఉన్నదని, కళాశాలల బందుతో విద్యార్థులు నష్టపోతున్నారని అన్నారు. సమావేశంలో నాయకులు ఎండీ మసూద్, ఉగ్గి ప్రసాద్, పరమేష్‌కుమార్, అజార్, ఉపేందర్, మహేష్ పాల్గొన్నారు.

● తుర్కపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మాదాపూర్ గ్రామంలో ఓర్సు లక్ష్మయ్య ఇంట్లో ఈనెల 16న చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ తక్యుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలం ధర్మారం గ్రామానికి చెందిన పొన్నాల రాజు 16న లక్ష్మయ్య ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించాడు. బీరు వాలో ఉన్న 10 తులాల వెండి అభరణాలు, కొంత నగదును దొంగలించాడు. దాంతో లక్ష్మ య్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టగా లక్ష్మయ్య ఇంటి సమీపంలో ఉన్న చింత రాంకోటి ఇంటికి సీసీ కెమెరాను పరిశీలించి దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తిని పట్టుకున్నట్లు చెప్పారు. నిందితుడి నుంచి 10తులాల వెండి అభరణాలు కొంత నగదును స్వాధీనం కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

● వలిగొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముద్దాపురం గ్రామానికి చెందిన సోలిపురం నర్సిరెడ్డి ట్రాక్టర్ బ్యాటరీని బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ట్రాక్టర్ ఎత్తుకెళ్లిపోయారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగేందర్ గౌడ్ తెలిపారు.

● వలిగొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : బొలెరో ఢీ కొని ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అజీజుద్దీన్ ఆయన సోదరి నజీముద్దీన్ స్కూటీపై మోడల్ స్కూల్ నుంచి ఇంటికి వస్తుండగా ఎదురుగా వచ్చిన వాహనం ఈ స్కూటీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

● భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో రిసోర్స్‌పర్సన్‌లకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మంచాల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న రిసోర్స్‌పర్సన్ల సమావేశానికి ఆయనహాజరై మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఆర్పీల జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు రామసాని వసంత, పద్మ, అనూరాధ, పద్మజ, చంద్రకళ, సుజాత, చంద్రిక, సురేఖ, సంతోష, రమ్య తదితరులు పాల్గొన్నారు.

● చౌటుప్పల్ టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మహిళా చైతన్యంతోనే సమాజంలో మార్పు సాధ్య మని ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అవ్వారీ రామేశ్వరీ, బంటుపల్లి అనురాధ అన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని కందాళ రంగారెడ్డి భవన్‌లో గురువారం నిర్వహించిన ఐద్వా మునిసిపాలిటీ రెండో మహాసభలో వారు మాట్లాడారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని వారు తెలిపారు. సభలో మునిసిపాలిటీ నూతన అధ్యక్షురాలిగా చింతకింది శారద, కార్యదర్శిగా ఉండి రేష్మాను ఎన్నుకున్నారు.

● మోత్కూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మునిసిపాలిటీలో మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితా లక్ష్మీ నర్సింహారెడ్డి మొక్కల పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 1వవార్డు కౌన్సిలర్ పురుగుల వెం కన్న, నాయకులు పాల్గొన్నారు.